

నేడు కానిస్టేబుల్ రాతపరీక్ష

కానిస్టేబుళ్ల ఎంపికకు తుది రాతపరీక్ష ఆదివారం జరగనుంది. ఇందుకోసం జిల్లాలో 21 కేంద్రాలు ఏర్పాటుచేశారు. 6లో



చట్టాలపై అవగాహన అవసరం

మహిళలు తమ రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జావీద్ పాషా సూచించారు. 6లో

గరిష్టం / కనిష్టం
36° / 25°

వాతావరణం

ఆదివారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశముంది.

పంజరంలో చేప!

సాధారణంగా చెరువులు, నదులు.. ఇలా జలాశయాల్లో చేపలను పెంచుతారు. ఏటా వర్షాకాలంలో పిల్లలను వదలడం.. ఏడు, ఎనిమిది నెలల తర్వాత వలలు వేసి చేపలు పట్టడం మనందరికీ తెలిసిందే. కానీ ఇక్కడ మాత్రం పంజరంలో చేపలు పెంచుతారు! ఇదేమిటని అనుకుంటున్నారా? ఔను నిజమే.. కేజ్ కల్చర్‌గా పిలిచే ఈ విధానం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లో తొమ్మిదేళ్లుగా విజయవంతంగా సాగుతోంది.

– సాక్షి, ఖమ్మం డెస్క్



పాలేరు రిజర్వాయర్‌లోని కేజ్ కల్చర్ యూనిట్ (ఇన్‌సెట్) మత్స్యకారులు పట్టిన చేపలు



యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పాలేరులో విజయవంతంగా 'కేజ్ కల్చర్'

- తొమ్మిదేళ్ల క్రితం రిజర్వాయర్‌లో యూనిట్ల ప్రారంభం
- రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 'సక్సెస్'
- వంద మందికి పైగా మత్స్యకారులకు ఉపాధి

జార్ఖండ్ రాష్ట్రంలోని చండిల్ రిజర్వాయర్ వద్ద కేజ్ కల్చర్ విధానం సక్సెస్ కావడంతో తెలంగాణలోనూ అమలుకు 2014లో ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాలను ఎంపిక చేసింది. తొలిదశలో నిజామాబాద్ జిల్లా పోచంపాడు రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ మొదలుపెట్టారు. ఆ తర్వాత పాలేరు రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్‌ను అప్పటి వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.



ఏమిటీ విధానం

సాధారణంగా జలాశయాల్లో చేపపిల్లలు వదిలి అవి పెరిగాక మత్స్యకారులు పట్టి అమ్ముకుంటారు. అయితే, నీరు బయటకు వెళ్లే క్రమంలో చేపపిల్లలు కూడా వెళ్లిపోతాయి. అలాగే, చేపలకు వైరస్ సోకినా మందులు వేసేందుకు, దాణా వేయాలన్నా ఇబ్బందులు వస్తాయి. ఇక చేపలు పట్టే క్రమంలోనూ చెరువంతా గాలించాల్సి వస్తుంది. కానీ కేజ్ కల్చర్ విధానంలో అంతా భిన్నంగా ఉంటుంది. నీటిలో తేలే గుణం ఉన్న ప్లాస్టిక్ డబ్బాలను ఒక దానికొకటి అమరుస్తారు. ఆపై యూనిట్ చుట్టూ(వెలుపల) లావు తాళ్లతో బిగించి, కింద కూడా లోతు వరకు వలలు బిగిస్తారు. ఫలితంగా మత్స్యకారులు వదిలే చేపపిల్లలు యూనిట్ పరిధిలోనే తిరుగుతుండడంతో దాణా వేయడం, వైరస్ సోకితే మందులు ఇవ్వడం సులభమవుతుంది. అంతేకాక ఎప్పటికప్పుడు సైజ్ చూసుకుంటూ వల వేసి పట్టడం కూడా ఈజీగా పూర్తవుతుంది. ఒకమాటలో చెప్పాలంటే పొలంలో పంటను చూసుకున్నట్లు ఇక్కడ చేపలను ఎప్పటికప్పుడు పరిశీలించొచ్చు.

పది యూనిట్లు.. 100 మంది

పాలేరు రిజర్వాయర్‌కు తొలి దశలో పది కేజ్ కల్చర్ యూనిట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత ఎంపిక చేసిన పది మంది మత్స్యకారులను జార్ఖండ్ రాష్ట్రంలోని చండిల్ రిజర్వాయర్ వద్దకు పంపించి శిక్షణ ఇప్పించారు. వీరు ఇక్కడ మరో 90 మందికి శిక్షణ ఇవ్వడంతో ఈ యూనిట్ల ద్వారా 100 మంది లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఒక్కో యూనిట్ ఖరీదు రూ.30 లక్షలు ఉండగా.. ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం కింద ఈ యూనిట్లను మత్స్యకారులు నిర్వహిస్తున్నారు. వీరు 20 శాతం వాటా ధనంగా వెచ్చించారు.

ఎనిమిది నెలల పంట

కేజ్ కల్చర్ యూనిట్లలో సహజంగా పంగాసియాస్ (నల్లజెల్ల, పెద్ద జెల్లలు, తెల్ల చేపలు) చేపలను పెంచుతారు. ఈ రకం చేపలు పెంపుడు కుక్కలు, పిల్లుల మాదిరే నిర్దేశిత ప్రాంతాన్ని దాటి బయటకు వెళ్లవు. మూడు అంగుళాల పిల్లలు పోస్తే ఎనిమిది నెలల కాలంలో ఒక్కో చేప కిలో నుంచి కిలోన్నర బరువు పెరుగుతుంది. చేప ఒక కిలో పెరగడానికి మత్స్యకారులకు దాణా, ఇతర ఖర్చులు కలిపి రూ.50 అయితే.. రూ.120 నుంచి రూ.150 వరకు అమ్ముకున్నా యాభై శాతానికి పైగా లాభం సమకూరుతుంది. ఒక యూనిట్ పరిధిలో 4 నుంచి 5 టన్నుల మేర దిగుబడి వస్తుండడంతో సీజన్‌లో ఒక్కో మత్స్యకారుడికి సుమారు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా.

మాకూ కావాలి..

పాలేరు కేజ్ కల్చర్ విధానం విజయవంతం కావడంతో పలువురు మత్స్యకారులు తమకు కూడా మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న కేజ్ కల్చర్ నిర్వాహకులు వలలు, ఇతర పరికరాలను సబ్సిడీపై అందించాలని కోరుతున్నారు. కాగా, కరోనా ముందు మాదిరి కేజ్ కల్చర్ చేపలను వ్యాపారులు విదేశాలకు ఎగుమతి చేస్తే డిమాండ్ మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

వ్యవసాయం మాదిరే ఇది..



వ్యవసాయ భూమికి కేజ్ కల్చర్‌కు పోలిక ఉంది. వ్యవసాయ భూమిలో పంట మాదిరే కేజ్ కల్చర్‌లో చేపల పంట వస్తుంది. ఏటా మత్స్యకారులకు పంట చేతికొచ్చినట్లే. ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో మరికొందరు మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్నారు. పాలేరు రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ విజయవంతమైంది.

– దేశబోయిన ఏడుకొండలు, నాయకన్‌గూడెం

మంచి ఫలితాలు వస్తున్నాయి..



రాష్ట్రంలో ఎక్కడా లేనట్లుగా కేజ్ కల్చర్ విధానం పాలేరు రిజర్వాయర్‌లో మంచి ఫలితాలు ఇస్తోంది. వంద మంది మత్స్యకారులు చేపల పెంపకం చేపడుతున్నారు. ఈ విధానంలో కోళ్ల పెంపకం మాదిరే దాణాకు ఖర్చవుతుంది. లాభాలు యాభై శాతానికి పైగా ఉంటాయి. పలువురు కేజ్ కల్చర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఆదర్శ పాలనే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండాలని, ప్రజా సంక్షేమానికి నాణ్యమైన పాలన అందించాలనే యోచనతో రాష్ట్రప్రభుత్వం నూతన సచివాలయాన్ని నిర్మించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. సచివాలయాన్ని ఆదివారం ప్రారంభించనుండగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ స్వరాష్ట్ర సాధన లక్ష్యాన్ని సాధించడమే కాక ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని మంత్రి పువ్వాడ తెలిపారు. కాగా, సచివాలయం రాష్ట్రానికే గర్వకారణమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మరో ప్రకటనలో వెల్లడించారు.

నాటి కల సాకారమైంది

మంత్రిగా తాను ఉన్న సమయాన 2017 సెప్టెంబర్ 6న నూతన సచివాలయ నమూనాను విడుదల చేసినట్లు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాజ దుర్గమైన సచివాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తుండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

జిల్లాకు చేరుకున్న వైఎస్.షర్మిల

రఘునాథపాలెం: జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన కోసం వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల శనివారం రాత్రి చేరుకున్నారు. ఈమేరకు ఆమె రఘునాథపాలెం మండలంలోని ఈర్లపుడిలో బస చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి షర్మిల పూలమాల వేసి నివాళులర్పిస్తారు. ఆతర్వాత ఇటీవల వర్షాలతో పంటలు నష్టపోయిన వివిధ గ్రామాల్లోని రైతులను పరామర్శించి మాట్లాడుతారు. అలాగే, సోమవారం ఉదయం ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మే డే సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి మరికొన్ని ప్రాంతాల్లో పర్యటిస్తారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, పల్లకీ సేవ నిర్వహించగా తెలంగాణ, ఏపీ నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ రైలుకు స్వాగతం



రైలుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: గంగ పుష్కరాల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటుచేసిన భారత్ గౌరవ్ రైలు శనివారం సాయంత్రం ఖమ్మంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం స్టేషన్‌లో అధికారులు ఘన స్వాగతం పలికారు. పూరీ, కాశీ, అయోధ్య వెళ్తున్న భక్తుల కోసం ఈ రైలును ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన రైలు ఖమ్మం మీదుగా వెళ్లగా, తిరిగి వచ్చే నెల 7న సికింద్రాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రైలులో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఇక ఖమ్మం నుండి బయలుదేరిన మహిళా ప్రయాణికులకు బొట్టు పెట్టి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌టీఈ ప్రత్యేష్, ఏడీఈఎస్ ప్రకాశ్‌సింగ్, ఎస్‌ఎం జేఎస్‌వీ.ప్రసాద్, సీసీఐ ఎం.డీ.జాఫర్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి, టీఐ వీఎల్‌ఎన్.శాస్త్రి, సీటీఐ శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఏఎస్ స్కూళ్ల నుండి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ద్వారా అమలుచేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) పథకానికి సంబంధించి కొత్త పాఠశాలల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల గుర్తింపు కలిగిన ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు 2023–24 విద్యాసంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడిచిన ఐదేళ్లలో పదో తరగతి 90శాతం పైగా ఫలితాలు సాధించిన పాఠశాలలు 3వ తేదీ లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

3 నుంచి తిరుకల్యాణోత్సవాలు..

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో మే 3 నుంచి 8వ తేదీ వరకు తిరుకల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా 3న వాస్తు పూజ, మృత్సంగ్రహణం, ఉత్సవాలకు అంకురార్పణ, 4న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, ఎదుర్కోలు, 5న స్వామి వారి తిరుకల్యాణోత్సవం, 6న చతుఃస్థానార్చన, రథోత్సవం, 7న పూర్ణాహుతి, 8న తెప్పోత్సవం, దొంగల దోపు, పుష్పయాగాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

పేద ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్

- రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- వెంకటాపురం ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగం
- గంగారంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ
- హాజరైన ఎంపీలు పార్థసారధిరెడ్డి, నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, ఎమ్మెల్యే వెంకటవీరయ్య



మినీ స్టేడియాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ గౌతమ్, ఎంపీలు, ఎమ్మెల్యే



సత్తుపల్లి మండలం గంగారంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన ఎంపీలు పార్థసారధిరెడ్డి, నామా, రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి/వేంసూరు: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేయించుకున్న సర్వేల్లో ఇరవై సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని తేలిన నేపథ్యాన... పేద ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్ పార్టీ పదిలంగా ఉన్నట్లేనని రాష్ట్ర క్రీడలు, టూరిజం, సాంస్కృతిక, యువజన సర్వీస్, ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వేంసూరు మండలం వెంకటాపురంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు తెలంగాణ ఎలా ఉంది, ఇప్పుడెలా ఉందో ప్రజలు పరిశీలిస్తే అభివృద్ధి అర్థమవుతుందని తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నిబద్ధత కలిగిన నాయకుడని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కాగా, సత్తుపల్లి మండలం గంగారంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించాక మంత్రి మాట్లాడుతూ పాపన్నగౌడ్ గౌడ కులస్తులకే కాక అన్ని వర్గాలను కలుపుకుని రాజు అయిన గొప్ప వీరుడని తెలిపారు. లండన్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో సర్దార్ పాపన్నగౌడ్ చరిత్ర ఉండగా.. ఛత్రపతి శివాజీ సమకాలికుడైన ఆయన చరిత్రను ఆంధ్రా పాలకులు విస్మరించారని మంత్రి ఆరోపించారు.

ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యం

ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన తన లక్ష్యం వేంసూరు మండలాన్ని అభివృద్ధి చేయటమేనని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి అన్నారు. మిషన్ భగీరథ కింద అభివృద్ధి చేసిన తన స్వగ్రామంలోని కందుకూరు నల్లచెరువు మండు వేసవిలోనూ నీళ్లు, చేపలతో కళకళలాడుతుండడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకటవీరయ్యను గెలిపించడమే కాక సీఎం కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సీఎంగా విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికి ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావుతో పాటు గొర్ల సంజీవరెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, మోర్ల ఏడుకొండలు, బెజవాడ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, పగుట్ల వెంకటేశ్వరరావు, మారోజు సుమలత, దొడ్డా శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, పాల వెంకటరెడ్డి, ఎండీ.ఫైజుద్దీన్, సునీత, మౌనిక, పి.ఝాన్సీరాణి, దాసరి వెంకట్రాంరెడ్డి, మందపాటి వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం చూపు తెలంగాణ వైపు...

కల్లూరు: తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వాన అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని.. అందరి చూపు తెలంగాణ వైపే ఉందని రాష్ట్ర వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కల్లూరులో రూ.3.40 కోట్ల వ్యయంతో నిర్మించిన మినీ స్టేడియంను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతున్నాయని, పక్క రాష్ట్రాల ప్రజలు కూడా తెలంగాణ వంటి పథకాలు అమలుకావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం క్రీడారంగానికి ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ మినీ స్టేడియానికి మరో రూ.కోటి మంజూరు చేస్తే మిగతా సౌకర్యాలు కల్పించొచ్చని చెప్పారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కల్లూరులో మినీ స్టేడియం అందుబాటులోకి రావడం ఈ ప్రాంత క్రీడాకారులకు మంచి అవకాశమన్నారు. తొలుత మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యే, కలెక్టర్ షటిల్ ఆడడంతో పాటు జిమ్ ప్రాక్టీస్ చేశారు. డీవైఎస్ఓ పరంధామరెడ్డి, పీఆర్ ఈఈ రామచంద్రమౌళి, డీఈఆర్.రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ హేమలత, డీఈఓ సోమశేఖర్‌శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావుతో పాటు బీరవల్లి రఘు, కట్టా అజయ్‌కుమార్, చెక్కిలాల మోహనరావు, డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, బోబోలు లక్ష్మణరావు, ఎం.డీ.ఇస్మాయిల్, కాటమనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, పెడకంటి రామకృష్ణ, సీహెచ్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు



సిరిని అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

బోనకల్: ఇటీవల నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ అండర్–15 బాలికల విభాగంలో జిల్లా క్రీడాకారిణికి పతకాలు దక్కాయి. బోనకల్ మండలం జానకీపురానికి చెందిన గద్దల సిరి సింగిల్స్‌లో కాంస్యం, డబుల్స్‌లో రజత పతకం సాధించింది. సిరిని కలెక్టర్ గౌతమ్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగాల సునీల్‌కుమార్‌తో పాటు కూరపాటి ప్రదీప్, ఓలేటి సాంబమూర్తి అభినందించారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన డీఎంఓ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంఓ అలీం

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లిలోని ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ మహ్మద్ అలీం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన ఆయన సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఏడాది లక్ష్యాన్ని దాటి మార్కెటింగ్ ఫీజు వసూలు చేసిన సెక్యూరిటీ గార్డులు చాగర్ల లక్ష్మయ్య, ఎస్‌కే మునీర్ తదితరులను అభినందించారు.

సేవా లోపంపై రూ.50 వేల జరిమానా

ఖమ్మంలీగల్: బ్యాంకు రుణం తీసుకుని సకాలంలో డబ్బు చెల్లించినా ఇంటి పత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిన బ్యాంకుకు రూ.50 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం వినియోదారుల కమిషన్ శనివారం తీర్పు చెప్పింది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన బొల్లి ఉపేంద్ర 2004లో తన ఇంటిని తాకట్టు పెట్టి బ్యాంక్ నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాడు. అయితే, ఇంటి పత్రాలు అడగ్గా బ్యాంక్ అధికారులు స్పందించకపోవడంతో న్యాయవాది నరేంద్ర స్వరూప్ ద్వారా జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశాడు. విచారించిన కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత బ్యాంక్ సేవాలోపాన్ని నిర్ధారిస్తూ రూ.50 వేల జరిమానా విధించడమే కాక కేసు ఖర్చుల కింద మరో రూ.5 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

అట్రాసిటీ కేసును విచారించిన ఏసీపీ



ఘటనాస్థలిలో విచారిస్తున్న ఏసీపీ రెహమాన్

బోనకల్: బోనకల్‌లో ఈ నెల 25న జరిగిన దాడి ఘటనకు సంబంధించి పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఘటనాస్థలాన్ని వైరా ఏసీపీ రెహమాన్ శనివారం పరిశీలించి విచారణ చేపట్టారు. అనంతరం జగ్గయ్యపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడుమల శ్రీకాంత్‌ను కూడా విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు.

మొక్కజొన్న రాశి వద్ద వృద్ధురాలి మృతి

నేలకొండపల్లి: మొక్కజొన్నలు ఆరబెట్టేందుకు వెళ్లిన వృద్ధురాలు ఆ రాశి వద్దే మృతి చెందింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని ముజ్జుగూడెంనకు చెందిన బొడ్డు రాములు – చిన్నమ్మాయి (65) దంపతులు మొక్కజొన్నలను ఆరబెట్టేందుకు శనివారం స్థానిక బౌద్ధ క్షేత్రం వద్దకు వెళ్లారు. భర్త ఓ చోట, భార్య ఇంకో చోట ఉండగా, చిన్నమ్మాయి కాసేపటికి అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు గమనించారు. దీంతో వీరి కుమారుడు చేరుకుని తల్లిని 108లో ఖమ్మం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురైందా లేక ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనేది తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మురళి (ఫైల్)

తల్లాడ: తల్లాడ మండలం మిట్టపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సుంకర మురళి (30) ఎన్టీఆర్ జిల్లా నూరారంలో జరిగిన మేనకోడలు ఓణీల ఫంక్షన్‌కు హాజరై తన భార్యతో మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలోమిట్టపల్లి వద్ద కారు ఢీకొనడంతో మురళి అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్యకు గాయాలయ్యాయి.

జేఈఈ మెయిన్స్‌లో ‘ప్రైవేట్’ సత్తా

మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు

జేఈఈ మెయిన్స్–2 ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు అభినందించి వివరాలను వెల్లడించాయి.

– ఖమ్మంసహకారనగర్

● న్యూవిజన్ హవా



విద్యార్థులను అభినందిస్తున్న న్యూవిజన్ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు గోపీచంద్, కార్తీక్

జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో తమ విద్యార్థుల హవా కొనసాగిందని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. ఓపెన్ కేటగిరీలోనూ అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని చెప్పారు. ఆలిండియా స్థాయి ఓపెన్ కేటగిరీలో కె.భవ్య 254వ ర్యాంక్, బి.రిత్విక్ 286, జి.నీరజ్‌రెడ్డి 372, వి.వెంకటసాత్విక్ 521, పి.రోహిత్‌సాయిఅన్వేశ్ 558, పి.వరుణ్ 1,045వ ర్యాంక్‌లు సాధించినట్లు తెలిపారు. ఇంకా వివిధ కేటగిరీల్లో టి.జస్మిత 35వ ర్యాంక్, కె.భవ్య 43, బి.రిత్విక్ 48, టి.శశాంక్ 70, లూథర్ 124, జి.రేవంత్‌కుమార్ 198, కె.లోహిత్‌చంద్ర 300, బి.కార్తీక్ 473, బి.దీక్షిత్‌నాయక్ 516, డి.రేణుశ్రీ 519, బి.జశ్వంత్‌సింగ్‌రాథోడ్ 597, ఎ.రోహాల్‌సాయి 627, పి.ఈశ్వర్ 809. జి.మహీందర్ 820, బి.ఇందు 928, ఎం.గోకుల్ సాహితి 940, టి.సింహాద్రి 1,191, కె.రాహుల్ 1,238, చేతన్ 1,301, ఎల్.దీక్షిత 1,733 ర్యాంకు సాధించారన్నారు. డైరెక్టర్ సీహెచ్.గోపీచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్‌లు మాట్లాడుతూ తమ విద్యార్థులే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కృష్ణవేణి విజయకేతనం



విద్యార్థులతో కృష్ణవేణి యజమాన్యం, సిబ్బంది

జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని కళాశాలలో శనివారం వారు విద్యార్థులను అభినందించాక మాట్లాడారు. తమ విద్యార్థులు బి.అరవింద్ 54, టి.నేహాశ్రీ 186, ఎస్‌కే సుభానీ 280, టి.జనేషు 367, ఎస్.వెంకటసాయితేజ 472, టి.పవన్ 823, డి.మనోజ్ 897, పి.రవిశంకర్ 1,201, బి.కల్యాణ్ 1,357, బి.కిరణ్ 1,535, బి.బాబా 1,596, జె.సోని 1,957, నిఖిలశ్రీ 2,197, ఆర్.చంటి 2,229, బి.యశ్వత 2,864, కె.అనుశ్రీ 3,143, బి.అమిత 3257, బి.మహేశ్ 3,363, జి.చైతన్య 3,365, పి.అస్మిత 3,593, బి.తులసిప్రియ 3,614, బి.శివరామకృష్ణ 4,149, జి.దేవేందర్, 4,187, బి.కార్తీక్ 4,502, సిరిబాయి 4,556, జి.సిద్ధు 4,851 ర్యాంకులు సాధించారని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకడమిక్ డీన్ శేఖర్‌బాబు, ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీచైతన్య అగ్రగామి



మాట్లాడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య

జేఈఈ మెయిన్స్–2లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకు లతో అగ్రగామి ఫలితాలు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. మొత్తంగా 541 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. బి.నిషాగోపిక 16వ ర్యాంక్ సాధించగా, టి.హర్షవర్ధన్ 70, బి.సాయిబాలాజీ 78, జి.మణిప్రకాష్ 79, ఎ.ఇందురెడ్డి 104, వి.భానుప్రసన్న 129, బి.వివేక్‌వర్ధన్‌వర్మ 149, ఎం.ఉపేందర్ 258, బి.పవన్‌కార్తీక్ 275, ఎస్.జశ్వంత్‌సాయి 297, కె.శివగుప్త 370, బి.మదన్‌లాల్ 431, బి.జగదీశ్ 496, ఎం.వంశీ 556, బి.భానుప్రకాష్ 598, బి.సాత్విక్ 610, బి.వెన్నెల 665, ఎ.యశ్వంత్ 718, ఆర్‌బీ రాంచరణ్ 785, జె.ప్రణీత్ 854, బి.వేణు 892, బి.పూజిత 948, వి.గణేశ్ 1,124, ఐ.మహీందర్‌వర్మ 1,319, పి.హర్షిత్‌చౌదరి 1,353, బి.సింధు 1,391, బి.కీర్తనవర్మ 1,447వ ర్యాంక్ సాధించారని చెప్పారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు సాయిగీతిక, సీహెచ్ చేతన్‌మాథూర్, డీన్ వర్మ, ఏజీఎంలు బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

● రెజొనెన్స్‌కు ఆలిండియా 5వ ర్యాంక్

జేఈఈ మెయిన్స్–2లో తమ విద్యార్థి టి.నిఖిల్ ఆలిండియా స్థాయిలో ఐదో ర్యాంక్ సాధించాడని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. వివిధ కేటగిరీల్లోనూ తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఈ మేరకు బి.రాజేశ్ 447, వై.భార్గవి 517, వి.సాయిఅక్షయ్ 1,139, ఎ.సచిన్ 2,278, బి.ప్రవీణ్‌తేజ 2,279, ఎం.అభినయ్ 2,945, బి.వాసు 2,972, బి.ముకేశ్ 3,800, బి.అశోక్‌కుమార్ 4,773వ ర్యాంకు సాధించగా, 150 మందికి పైగా విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు. ప్రిన్సిపాళ్లు సతీశ్, భాస్కర్‌రెడ్డి, శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు



విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

● హార్వెస్ట్‌కు ర్యాంకుల పంట

హార్వెస్ట్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్–2లో అగ్రశేణి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఎల్.వెన్నెల 264వ ర్యాంకు, ఎల్.ప్రహ్లాద్ 689, పి.లతాశ్రీ 1958, యు.మోహన్‌సాయి 2,347, టి.సౌమ్య 3,024, టి.పఠానీ 3,612, వి.దేదీవ్య 4,153, డి.మణిదీప్ 4,395, కె.నవదీప్ 4,777, టి.తరుణ్‌గోపాల్ 4,996 ర్యాంకు సాధించగా, కేటగిరీల వారీగా 5 వేల లోపు 10 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఇక ఎస్టీ కేటగిరీలో ఎ.భానుప్రకాశ్ 1,575వ ర్యాంకు, బి.ననత్‌కుమార్ 1,958, కె.నందిని 2,112, ఆదిత్య 2,644, కె.భావనశ్రీ 2,914 ర్యాంకు సాధించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జావీద్‌పాషా

ఖమ్మం క్రైం: మహిళలు తమ రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయాధికార సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా సూచించారు. పోలీసు కమిషనరేట్ పరిధిలోని భరోసా సెంటర్ ఆధ్వర్యాన శనివారం టీటీడీసీలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో జావీద్‌పాషా ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి నుంచి రక్షణ ఉన్న చట్టాలపై అవగాహన తప్పనిసరి అని చెప్పారు. అలాగే, బాధితులకు కోర్టు పరంగా అందే సహకారాన్ని వివరించారు. ఆతర్వాత డీహెచ్‌ఈడబ్ల్యూ బాధ్యులు ఎస్.డీ.సమ్రీన్, లీగల్ అడ్వైజర్ పి.లలిత, సఖి సెంటర్ అడ్మిన్ సరిత, సీఐలు సాంబరాజు, పి.నవీన్, భరోసా జిల్లా కోఆర్డినేటర్ రాజకుమారి మాట్లాడారు. ఈ సమావేశంలో ఐకేపీ, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కానిస్టేబుల్ రాతపరీక్ష

- జిల్లాలో 21 కేంద్రాలు, 12,156మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా వెనక్కే...



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికకు ప్రిలిమ్స్ రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆదివారం తుది రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 12,156మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు అభ్యర్థులు గంట ముందుగా చేరుకోవాలని సీపీ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనున్నందున ముందుగానే రావాలని, నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కాగా, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఊరేగింపులపై నిషేధం ఉంటుందని, సమీప జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. కేంద్రాల్లోకి పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ అధికారులు మినహా మరెవరికీ అనుమతి ఉండదని తెలిపారు. కాగా, ఐదుగురు ఏసీపీలు, పది సీఐలు, 30మంది ఎస్సైలు, 105మంది సిబ్బందితో బందోబస్తున్న ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు.

అభ్యర్థులకు సూచనలు

పరీక్షకు హాజరై అభ్యర్థులు చేతులకు గోరింటాకు, మెహందీ పెట్టుకోవద్దు. అలా చేస్తే బయోమెట్రిక్ వేలిముద్ర నమోదులో ఇబ్బందులు ఎదురవుతాయి. అలాగే, ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే వారి వివరాలను పోలీసులకు తెలియచేయాలి. కేంద్రాల వద్ద మహిళా అభ్యర్థులను తనిఖీ చేసేందుకు తగిన సంఖ్యలో మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులను నియమించారు. దూరప్రాంతాల వారు ముందుగానే కేంద్రాలకు చేరుకుంటే ఇబ్బందులు ఉండవని సీపీ ఓ ప్రకటనలో తెలిపారు.

అనుమానమే పెనుభూతమై...

భార్యను రోకలిబండతో కొట్టి చంపిన భర్త



నీల (ఫైల్)



నీల మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేష్, ఎస్ఐ శంకరరావు

కొణిజర్ల: అనుమానం పెనుభూతంగా మారడంతో కట్టుకున్న భర్త భార్యను రోకలిబండతో మోదిన భర్త హత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి శివారు యల్లన్ననగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. రఘునాథపాలెం గ్రామానికి చెందిన జర్పుల లాల్‌సింగ్ – జర్పుల నీల(45) దంపతులు కొన్నేళ్లుగా తమ కుమారుడితో కలిసి యల్లన్ననగర్‌లో ఉంటూ కూలి పనులకు వెళ్తున్నారు. లాల్‌సింగ్‌కు గతంలో రెండు వివాహాలు జరగ్గా నీల మూడో భార్య. అయితే, నీలకు ఆయనకు తరచుగా అక్రమసంబంధాలు అంటగడుతూ అనుమానంతో రోజూ వేధించేవాడు. శారీరకంగా వేధిస్తుండడంతో గతంలో రెండు సార్లు పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించినా లాల్‌సింగ్ ప్రవర్తనలో మార్పు లేదు. ఈక్రమంలో శుక్రవారం లాల్‌సింగ్ కుమారుడు గోపి బంధువుల పెండ్లి కార్డులు పంచడానికి ఊరికి వెళ్లగా రాత్రి నీలతో ఆయన గొడవ పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పక్కింటి మహిళ బానోత్ రజిత ఎంత పిలిచినా నీల స్పందించకపోవడంతో ఇంట్లో చూడగా నేలపై రక్తపు మడుగులో పడి ఉంది.

దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో వైరా సీఐ టి.సురేష్, ఎస్ఐ జె.శంకరరావు చేరుకుని రోకలిబండతో తలపై గట్టిగా కొట్టడం వల్లే నీల మృతి చెందిందనే నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం రాత్రి గొడవ అనంతరం నిద్రిస్తున్న నీలను లాల్‌సింగ్ రోకలి బండతో కొట్టి చంపి ఉంటాడని మృతురాలి సోదరుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులకు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా, లాల్‌సింగ్ ప్రస్తుతం పరారీలో ఉండగా ఆయన కోసం గాలిస్తున్న ఎస్ఐ తెలిపారు.

సీఈఐఆర్‌తో ఫోన్ల గుర్తింపు

మధిర: పలువురు వ్యక్తులు మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా.. ఇటీవల అందుబాటులోకి వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన మధిర టౌన్ పోలీసులు బాధితులకు అప్పగించారు. ఐదుగురు ఫోన్లు పోగొట్టుకున్నట్లుగా ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయించి ట్రాక్ చేశారు. దీంతో ఆ ఫోన్లు వాడుతున్న వారి నుంచి స్వాధీనం చేసుకుని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ పేరుతో నగదు స్వాహా

అశ్వారావుపేటరూరల్: ఓ ఖాతాదారుడిని సైబర్ నేరగాళ్లు బురిడి కొట్టించి డబ్బులు కాజేసిన ఘటన శనివారం జరిగింది. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నారంవారిగూడేనికి చెందిన సుభానికి గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు తాము ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, తక్షణమే ఎనీ డెస్క్ అప్లికేషన్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. సదరు అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న కొద్ది సేపట్లోనే సుభాని బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.14,630 నిందితులు డ్రా చేసి కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎవరు తల్లీ నీవు?!

- పెద్దాస్పత్రిలో నెలన్నరగా వృద్ధురాలి దుర్భరజీవనం
- కుటుంబ సభ్యులే వదిలి వెళ్లి ఉంటారని అనుమానాలు



వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళ్తున్న మార్చురీలో పనిచేసే వ్యక్తి

ఖమ్మం వైద్యవిభాగం: ఉరుకులు, పరుగుల జీవనంలో బంధాలు, బంధుత్వాల చోటు లేకుండా పోతోంది. నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిదండ్రులను సైతం నిర్లక్ష్యంగా వదిలేస్తున్న పిల్లలు కనిపిస్తున్నారు. ఇలాంటి ఘటనే ఖమ్మంలో చోటు చేసుకుంది. నడవలేక ఇబ్బంది పడడమే కాదు తన పని తాను చేసుకునే శక్తి లేని 70ఏళ్ల వృద్ధురాలు ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో నెలన్నర రోజులుగా ఉంటోంది. ఆస్పత్రి ఆవరణలోని ఆలయ అరుగులపై ఉంటూ ఆటో డ్రైవర్లు ఇచ్చే పండ్లు, బ్రెడ్ తింటూ కాలం వెళ్లదీస్తోంది. ఆమెను వివరాలు అడగగా.. తనది వరంగల్ పోస్టాఫీస్ ప్రాంతమని, పేరు గంగమ్మగా చెప్పడమే కాక కూతురు, అల్లుడు ఇక్కడ వదిలివెళ్లినట్లు చెప్పగలుగుతోంది. ఆమె మానసిక స్థితి సరిగా లేక పూర్తిస్థాయిలో మాట్లాడడం లేదు. అయితే, నెలన్నరగా స్నానం లేకపోవడంతో దుర్వాసన వస్తుండగా ఆటోడ్రైవర్లు ఆమెకు దుస్తులు తీసకొచ్చి స్నానం చేయించేందుకు యత్నించినా అంగీకరించలేదు. దీంతో మార్చురీలో పనిచేసే ఓ వ్యక్తి తాను నిర్వహించే ఆశ్రమానికి ఆమెను ఆటోలో బలవంతంగా తీసుకెళ్లాడు.